క్లుప్తంగా

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



తంగళ్లపల్లి పాఠశాలలో శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ మానస, ఎంపీటీసీ అంతయ్య

తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఎంపీటీసీ నిధులతో నిర్మించనున్న తరగతి గది, సమావేశ వేదికలకు సోమవారం ఎంపీపీ పడిగెల మానస రాజు ఎంపీటీసీ కోడి అంతయ్యతో కలిసి శంకుస్థాపన చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ.. అభివృద్ధి పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. హెచ్ఎం, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

పరామర్శ



మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఏఎంసీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకులు

చందుర్తి: మూడపల్లి గ్రామానికి చెందిన బొడ్డు దేవయ్య అనే వ్యక్తి అనారోగ్యంతో ఇటీవల మృతిచెందగా.. అతడి కుటుంబ సభ్యులను వేములవాడ ఏఎంసీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. మాజీ సర్పంచులు చిలుక అంజిబాబు, సంటి బాపురావు, మాజీ ఎంపీటీసీ అబ్బగోని రవీందర్‌గౌడ్, బొప్ప వెంకన్న, శంకర్, గుడిసే దేవరాజు, విజయ్‌యాదవ్ తదితరులున్నారు.

రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాలి

సిరిసిల్లటౌన్: అంగన్‌వాడీలకు రూ.2లక్షలు, హెల్పర్లకు రూ.లక్ష రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాలని జిల్లా అంగన్‌వడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎదురుగట్ల మమత కోరారు. సోమవారం అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీని కాకుండా ఇప్పుడు అంగన్‌వాడీలకు రూ.లక్ష, హెల్పర్లకు రూ.50వేలు మాత్రమే ఇస్తామనడం సరికాదన్నారు. గత ప్రభుత్వ హయాంలో కనీస వేతనాలు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.10లక్షలు కల్పించాలని కోరగా.. రూ.2లక్షలు, హెల్పర్లకు రూ.లక్ష ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు పద్మ, శ్యామల, చొప్పరి అంజలి, పద్మ, సుధ, వజ్ర, ఏఐటీయూసి కార్యదర్శి కడారి రాములు తదితరులున్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

కోనరావుపేట: మండల సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శశికళ తెలిపారు. ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్యగౌడ్ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు, సభ్యులు హాజరు కావాలని కోరారు. పదవీకాలం పూర్తవుతున్న సందర్భంగా ఎంపీటీసీ సభ్యులకు సన్మాన కార్యక్రమం ఉంటుందన్నారు.

రేపు..

ఎల్లారెడ్డిపేట: మండల సర్వసభ్య సమావేశం బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సత్తయ్య సోమవారం తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

వాహనాల తనిఖీ

ముస్తాబాద్: చిప్పలపల్లి వద్ద ఎస్సై శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం వాహనాల తనిఖీలు చేపట్టారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపొద్దని యువకులకు సూచించారు. మైనర్లు వాహనాలు నడపొద్దని పేర్కొన్నారు. పలువురికి జరిమానాలు విధించారు.

పోస్టల్ వర్కర్ దినోత్సవం

వేములవాడఅర్బన్: జాతీయ పోస్టల్ వర్కర్ దినోత్సవం సందర్భంగా పోస్టల్ వ్యవస్థ ఎలా ఉపయోగపడిందనే అంశంపై పట్టణంలో పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. సబ్ పోస్ట్ మాస్టర్ సదానందం మాట్లాడుతూ.. కమ్యూనికేషన్ వ్యవస్థ చాలా వేగంగా ముందుకు సాగుతుందన్నారు. సబ్ పోస్ట్ మాస్టర్‌ను సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కల్యాణ్‌కుమార్ తదితరులున్నారు.

ఆర్థిక సాయం

బోయినపల్లి(చొప్పదండి): రెండు కిడ్నీలు చెడిపోయి బాధపడుతున్న కొదురుపాకకు చెందిన అబ్దుల్ బాసిత్‌ను ఆదుకోవాలని మిడ్ మానేరు పోరాట కమిటీ గ్రూప్‌లో పెట్టిన పోస్టుకు స్పందించి దాతలు రూ.33వేల ఆర్థిక సాయం చేశారు. కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్ ఆధ్వర్యంలో సోమవారం బాసిత్‌కు అందించారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపు

ముస్తాబాద్: మద్దికుంటలో సోమవారం డ్రా పద్ధతిలో అర్హులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించినట్లు తహసీల్దార్ సురేశ్ తెలిపారు. ప్రభుత్వం మద్దికుంటలో 65 డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించిందన్నారు. ఇప్పటికే కొన్ని టుబీహెచ్‌కేలో అర్హులకు అందించామని అన్నారు. మిగతా వాటిలో ఎంపికైన అర్హులకు డ్రా పద్ధతిలో ప్లాట్లను కేటాయించామన్నారు. ఎంపీపీ శరత్‌రావు, మాజీ ఎంపీపీ శ్రీనివాస్, ఆర్ఐ రఘు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల్లో నిర్లక్ష్యం..

- అవస్థల్లో ఉపాధ్యాయులు
- మండిపడుతున్న సంఘాలు
- బదిలీ టీచర్లకు రిలీవ్ గండం



ఎమ్మార్సీ భవనం వద్ద రిలీవ్ ఆర్డర్ల కోసం ఉపాధ్యాయుల పడిగాపులు

సిరిసిల్లఎడ్యుకేషన్: జిల్లాలోని ఎస్జీటీ ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించిన వెబ్ ఆప్షన్ల ఆధారంగా జరిగిన బదిలీ స్థానానికి వెళ్లడానికి అవసరమైన రిలీవింగ్ ఆర్డర్లు ఇవ్వడంతో అధికారులు నిర్లక్ష్యం చేయడంతో ఉపాధ్యాయులు అవస్థలు పడ్డారు. ఎంఈవో, క్లస్టర్ హెడ్మాస్టర్ల వద్ద తమకు రిలీవింగ్ ఆర్డర్లు ఇవ్వాలని పడిగాపులు కాశారు. రాష్ట్రంలో ఒక విధానం కొనసాగితే జిల్లాలో మరో విధానం సాగుతోందని ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నారు. దశాబ్దకాలంగా బదిలీల కోసం ఎదురుచూస్తున్న ఎస్జీటీలకు జిల్లా విద్యాశాఖ అధికారుల తీరుతో సోమవారం నిరాశ ఎదురైందన్న ఆరోపణలున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీల ఉత్తర్వులు సోమవారం ఉదయం వెలువడ్డాయి. ఉత్తర్వులు వెలువడిన వెంటనే బదిలీ అయిన ఉపాధ్యాయులను రేషనలైజేషన్ ఉత్తర్వులకనుగుణంగా రిలీవ్ చేయాల్సిన బాధ్యత జిల్లా విద్యాధికారి, మండల విద్యాధికారి, కాంప్లెక్స్ హెడ్మాస్టర్లపై ఉందని ఉపాధ్యాయ సంఘాలు పేర్కొన్నాయి. కానీ జిల్లాలో అధికారుల సమన్వయ లోపం కారణంగా ఉపాధ్యాయులను రిలీవ్ చేయడం లేదని వాపోతున్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయులు తిప్పలు పడుతున్నారని విమర్శలున్నాయి. ఇటీవల జరిగిన ఉపాధ్యాయ పదోన్నతుల్లో పదోన్నతి పొందిన ఉపాధ్యాయులను స్కూల్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్లు రిలీవ్ చేశారని, ఎస్జీటీలను కూడా స్కూల్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్లు రిలీవ్ చేస్తారని ఉపాధ్యాయులు ఉదయం నుంచి ఎదురుచూశారు. మండల విద్యాధికారులు రిలీవ్ చేస్తారని కాంప్లెక్స్ హెడ్మాస్టర్లు, కాంప్లెక్స్ హెడ్మాస్టర్లే రిలీవ్ చేయాలని మండల విద్యాధికారులు అనడం శోచనీయం. జిల్లా విద్యాశాఖ నిమ్మకు నీరెత్తినట్లు ఉపాధ్యాయులకు నష్టం చేసేలా వ్యవహరించినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

వెంటనే రిలీవ్ చేయాలి



మాట్లాడుతున్న శంకర్‌గౌడ్

బదిలీ కోసం వెలువడిన ఉత్తర్వులకనుగుణంగా వెంటనే ఉపాధ్యాయులను రిలీవ్ చేయడానికి చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాకాల శంకర్‌గౌడ్ డిమాండ్ చేశారు. అత్యవసరంగా కార్యవర్గంతో సమావేశం నిర్వహించి ఉపాధ్యాయులకు ఏళ్ల కాలం తర్వాత వచ్చిన అవకాశాలను అడ్డుకునే విధానాలను అవలంబిస్తే వారి పక్షాన పోరాడుతామన్నారు. జిల్లాలో దాదాపు 584 మంది ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

ప్రభుత్వ విప్‌ను కలిసిన టెక్స్‌టైల్ పార్క్ ప్రతినిధులు



ఆది శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న టెక్స్‌టైల్ పార్క్ అధ్యక్షుడు అన్నల్‌దాస్ అనిల్‌కుమార్, కార్యవర్గం

సిరిసిల్ల: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను సిరిసిల్ల టెక్స్‌టైల్ పార్క్ వస్త్రోత్పత్తిదారుల సంఘం ప్రతినిధులు సోమవారం కలిశారు. పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. టెక్స్‌టైల్ పార్క్ కార్యవర్గం ఎన్నికలు ఇటీవల జరిగాయి. అధ్యక్షుడు అన్నల్‌దాస్ అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి అంకారపు కిరణ్, ఉపాధ్యక్షుడు వేముల శ్రీనివాస్, కోశాధికారి యెల్లె లక్ష్మీనారాయణ, సహాయ కార్యదర్శి కట్టెకోల శివశంకర్, మాజీ అధ్యక్షుడు బొద్దుల సుదర్శన్ ఉన్నారు.

నాన్‌స్టాప్ మహిళా ప్రయాణికులకు లక్కీడిప్

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల–కరీంనగర్‌కు డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే మహిళా ప్రయాణికులకు ఇకపై నెలకు రెండుసార్లు లక్కీడిప్ ద్వారా బహుమతులు అందిస్తామని డిపో మేనేజర్ మనోహర్ తెలిపారు. ప్రతిరోజు సిరిసిల్ల నుంచి కరీంనగర్‌కు 12 డీలక్సు బస్సులు నడుపుతున్నట్లు వెల్లడించారు. వీటిలో ప్రయాణించే మహిళలకు ప్రతినెల 17, 01 తేదీల్లో డ్రా నిర్వహించి రూ.1,000 విలువ గల గిఫ్ట్ అందిస్తామని తెలిపారు. టికెట్ వెనుక పేరు, ఊరు, ఫోన్ నంబరు రాసి డ్రైవర్ వెనుక ఏర్పాటు చేసిన గిఫ్ట్‌బాక్సుల్లో వేయాలని సూచించారు.

రైతుల సంక్షేమమే లక్ష్యం



రైతులకు చెక్కులు అందిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రాథమిక సహకార సంఘం పని చేస్తుందని, వ్యవసాయ అనుబంధ రంగాలను అభివృద్ధి చేసేందుకు పెద్దఎత్తున రుణాలను అందిస్తున్నట్లు సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి అన్నారు. సహకార సంఘంలో సోమవారం నలుగురు రైతులకు రూ.20.80లక్షల రుణాల చెక్కులను పంపిణీ చేశారు. రైతులు ఆర్థిక స్వావలంబన సాధించాలంటే వ్యవసాయంతోపాటు దాని అనుబంధ రంగాలైన డెయిరీ, గొర్రెలు, పట్టుపురుగులు, కోళ్ల పెంపకం లాంటి వాటిపై దృష్టి సారించాలన్నారు. వైస్ చైర్మన్ జంగిటి సత్తయ్య, డైరెక్టర్లు వెంకటనర్సింహారెడ్డి, ప్రభాకర్‌రావు, ప్రభాకర్‌రెడ్డి, సతీష్, కార్యదర్శి కిశోర్‌కుమార్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎంపీటీసీ



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంపీటీసీ రాము

తంగళ్లపల్లి: చిన్నలింగాపూర్ ఎంపీటీసీ బైరినేని రాము సోమవారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాను మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌ను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. గ్రామ సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ పరిష్కరిస్తామని పేర్కొన్నట్లు రాము తెలిపారు.

సకాలంలో బిల్లులు చెల్లించాలి



సెస్ సిబ్బందితో మాట్లాడుతున్న రామారావు

వీర్నపల్లి(సిరిసిల్ల): వీర్నపల్లి మండల కేంద్రంలోని సెస్ కార్యాలయంలో సోమవారం చైర్మన్ చిక్కాల రామారావు సిబ్బందితో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలో రూ.4 కోట్లకు పైగా బకాయిలున్నాయన్నారు. వీటిపై ప్రత్యేక దృష్టి సారించి సకాలంలో బిల్లులు చెల్లించేలా చూడాలని ఆదేశించారు. వర్షాలు కురుస్తున్న సమయంలో సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. 11కేవీ కింద లూజ్ లైన్ సరిచేసేందుకు మిడిల్ పోల్స్ వచ్చాయని, మరో విడతలో ఎల్‌టీ లైన్ సరిచేసేందుకు స్తంభాలను ఏర్పాటు చేస్తామన్నారు. త్వరలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి అక్రమ కనెక్షన్లను తొలగించాలని ఆదేశించారు. మీటర్ లేని వ్యక్తులు గృహ, వాణిజ్య, వ్యవసాయ కనెక్షన్లు పొందాలని సూచించారు. సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, ఏడీఈ మహేందర్, ఉప సర్పంచ్ బోయిని రవి తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం



హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న నాయకులు

బోయినపల్లి: చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను క్రిష్ణనగర్‌తోపాటు అంబేద్కర్‌కాలనీ పరిసరాల్లో సోమవారం కాంగ్రెస్ మండల నాయకులు ప్రారంభించారు. మండల అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, సంబ లక్ష్మీరాజం, బోయిని ఎల్లేశ్, నల్ల మోహన్, దూస జనార్దన్, పిట్టల మోహన్, ద్యావ మహిపాల్‌రెడ్డి, అమ్మిగల్ల గోపాల్ తదితరులున్నారు.

ఐదేళ్లలో సంక్షేమం, అభివృద్ధి సాధించాం



మాట్లాడుతున్న ఎంపీపీ శరత్‌రావు

ముస్తాబాద్: మండల పరిషత్ పాలకవర్గం ఐదేళ్ల పాలనలో అభివృద్ధి పనులతోపాటు సంక్షేమ పథకాల అమలులో చేసిన కృషి ఎంతో సంతృప్తినిచ్చిందని ఎంపీపీ జనగామ శరత్‌రావు అన్నారు. మండల పరిషత్‌లో ఎంపీపీ, ఎంపీటీసీలు సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఎంపీపీ మాట్లాడుతూ.. మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ హయాంలో మండలంలో అభివృద్ధి చేశామన్నారు. వైస్ ఎంపీపీ అక్కరాజు లలిత, ఎంపీటీసీలు స్వేచ్ఛ, మంజుల, శ్రీనివాస్, రామచంద్రారెడ్డి, శ్రీధర్, బాలకిషన్, షాదుల్, నవీన్, నర్సింలు తదితరులున్నారు.

డెంగీ ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

కోనరావుపేట: గ్రామాల్లో డెంగీ వ్యాధి ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ నయీమా అన్నారు. కనగర్తిలో ప్రతి ఇంటి వద్ద దోమల నివారణ కోసం పైరిత్రియం మందును పిచికారీ చేయించారు. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించిన వైద్యాధికారి మాట్లాడుతూ.. గ్రామంలో ఇదివరకు డెంగీ కేసులు నమోదయ్యాయని అన్నారు. హెచ్‌ఈవో లింగం, సబార్డినేట్ అధికారి మోహన్, కార్యదర్శి కవితారెడ్డి, హెల్త్ అసిస్టెంట్ సవాయిలాల్, ఏఎన్ఎం సరోజన, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కబ్జా చేశారు



మాట్లాడుతున్న టోని

సిరిసిల్లటౌన్: జిల్లెల్ల గ్రామ శివారులోని ప్రభుత్వ భూములను బీఆర్ఎస్ నేతలు కబ్జా చేశారని కాంగ్రెస్ తంగళ్లపల్లి మండల అధ్యక్షుడు జాలుగం ప్రవీణ్(టోని) ఆరోపించారు. సోమవారం సిరిసిల్లలో నిర్వహించిన ప్రెస్‌మీట్లో మాట్లాడారు. గ్రామ శివారులో ఏర్పాటు చేసిన వ్యవసాయ కళాశాల కోసం అప్పటి ప్రభుత్వం రైతుల నుంచి భూసేకరణ జరిపిందన్నారు. కొత్త చెరువు, ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్నారని, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు.

ఇల్లంతకుంట ఎస్సైగా శ్రీకాంత్‌గౌడ్



తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇల్లంతకుంట మండల ఎస్సైగా కదిరె శ్రీకాంత్‌గౌడ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఎస్సై ఎల్.రాజుగౌడ్ సిద్దిపేట జిల్లా కొమురవెల్లి పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయిన విషయం విదితమే.

గౌడ సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్‌గౌడ్

ఎల్లారెడ్డిపేట: పదిర గ్రామ శాఖ గౌడ సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా ఆంజనేయులుగౌడ్, కోశాధికారిగా మల్లేశంగౌడ్, ప్రధాన కార్యదర్శిగా మహేందర్‌గౌడ్, గౌరవ సలహాదారులుగా చిన్నన్నగౌడ్, రంగాగౌడ్, జవ్వాజి రాజుగౌడ్, గున్నాల వెంకటస్వామిగౌడ్, జవ్వాజి సత్యంగౌడ్, తాళ్లపల్లి శ్రీకాంత్‌గౌడ్, దాసరి కర్ణగౌడ్, తాళ్లపల్లి చిరంజీవిగౌడ్ ఎన్నికయ్యారు.

పౌష్టికాహార లోపం లేకుండా చూడాలి



ముస్తాబాద్‌లో చిన్నారి ఎత్తు కొలుస్తున్న సీడీపీవో అలేఖ్య

ముస్తాబాద్: చిన్నారుల్లో పౌష్టికాహార లోపం లేకుండా చూడాలని సీడీపీవో అలేఖ్య అన్నారు. మొర్రాయిపల్లి, ముస్తాబాద్ అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం చిన్నారుల బరువు, ఎత్తు చూశారు. సూపర్‌వైజర్ అరవింద, అంగన్‌వాడీ టీచర్లు పద్మ, స్రవంతి, అనురాధ తదితరులున్నారు.

వైద్య వృత్తి పవిత్రమైంది



డీఎంహెచ్‌వోను సత్కరిస్తున్న ప్రైవేట్ ఆసుపత్రుల సంఘం ప్రతినిధులు



ఎల్లారెడ్డిపేట: వైద్యులను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

సిరిసిల్లకల్చరల్: అన్ని వృత్తుల్లోకెల్లా వైద్య వృత్తి పవిత్రమైందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుమన్‌మోహన్‌రావు అన్నారు. సోమవారం జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో ప్రైవేట్ ఆసుపత్రుల సంఘం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రైవేట్ ఆసుపత్రుల సంఘం పక్షాన డీఎంహెచ్‌వోను ఘనంగా సత్కరించారు. సంఘం అధ్యక్షుడు డాక్టర్ రమేశ్, వైద్యులు జైల్‌సింగ్, మురళీకృష్ణ, సురసుర రాధాకృష్ణ, మానేరు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు చింతోజు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామం చేయాలి

వేములవాడ: బోన్ డెన్సిటీ నుంచి సంపూర్ణ ఆరోగ్యం సిద్ధించాలంటే క్యాల్షియం ఉన్న ఆహారాన్ని తీసుకోవడమే కాకుండా నిత్యం వ్యాయామం చేయాలని వైద్య దంపతులు నాగమల్ల పద్మలత–శ్రీనివాస్ అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా సోమవారం పార్థసారథి నర్సింగ్ హోమ్‌లో ఉచితంగా 100 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు.

ముస్తాబాద్: పేదల పాలిట వైద్య నారాయణుడిగా డాక్టర్ చింతోజు శంకర్ నిలిచారని లయన్స్ క్లబ్ బాధ్యులు, ఉపాధ్యాయులు అన్నారు. ముస్తాబాద్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థి అయిన డాక్టర్ చింతోజు శంకర్‌ను లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సన్మానించారు. నోడల్ ఆఫీసర్ రాజిరెడ్డి, పీడీ బుచ్చిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ముస్తాబాద్ పీపుల్స్ హాస్పిటల్, తిరుమల నర్సింగ్ హోమ్‌లలో వైద్య దినోత్సవం నిర్వహించారు. వైద్యులు చింతోజు రాజారాం, శంకర్, అర్చన, అఖిల, స్రవంతి, డాక్టర్ అనురాధ కేక్ కట్ చేశారు.

వేములవాడరూరల్: హన్మాజిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులను ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు సత్కరించారు. డా.దివ్యశ్రీ, నాయకులు చిలుక ప్రభాకర్, చెన్నాడి జగన్‌రెడ్డి, పసుల లక్ష్మీరాజం తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: అశ్విని ఆస్పత్రి వైద్యులు జి.సత్యనారాయణస్వామి, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అభినయ్‌ను సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య సన్మానించారు. సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

వేములవాడఅర్బన్: పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద దొడ్డి కొమురయ్య వర్ధంతి మహాసభ పోస్టర్‌ను సోమవారం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని వాసవి కల్యాణ మండపంలో ఈనెల 4న నిర్వహించే దొడ్డి కొమురయ్య వర్ధంతి వేడుక మహాసభను విజయవంతం చేయాలని కోరారు. ఎంపీపీ బండ మల్లేశం, జెడ్పీటీసీ నాగం కుమార్, జేఏసీ నాయకుడు బొజ్జ కనకయ్య, సంఘస్వామి, కడారి రాములు తదితరులున్నారు.

తంగళ్లపల్లి(సిరిసిల్ల): దొడ్డి కొమురయ్య వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు డిమాండ్ చేశారు. మండల యాదవ సంఘం నాయకుల ఆధ్వర్యంలో వర్ధంతి సభ కరపత్రాన్ని ఆవిష్కరించారు. బొబ్బల మల్లేశం, ఆసరి బాలరాజు, గోగు మల్లేశం, డాక్టర్ దేవేందర్, మందాడి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: దొడ్డి కొమురయ్య వర్ధంతి వేడుకలను విజయవంతం చేయాలని అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వాసం మల్లేశంయాదవ్ కోరారు. కోనరావుపేటలో వర్ధంతి కరపత్రాలను ఆవిష్కరించారు. జిల్లా నాయకులు అంబటి చంద్రశేఖర్, మోతుకు రవి, మోతుకు మోహన్, బొల్లు బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్జీటీలకు అన్యాయం తగదు

గంభీరావుపేట: పదోన్నతులు, బదిలీల్లో ఎస్జీటీలకు అన్యాయం చేయడం తగదని టీఆర్‌టీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయన్నగారి నారాయణ అన్నారు. మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.

నేతన్న పోరు యాత్రకు కార్మిక సంఘాల సంఘీభావం

సిరిసిల్ల: నేతన్న పోరు యాత్రను జూలై 7న నిర్వహిస్తున్నామని సీఐటీయూ నాయకుడు కూరపాటి రమేశ్ పేర్కొన్నారు. యాత్రను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్సీ సీతారాములు కోరారు. సిరిసిల్లలో ప్రారంభమయ్యే యాత్ర హైదరాబాద్ వరకు సాగుతుందన్నారు. యాత్రకు సీఐటీయూతోపాటు, హెచ్ఎంఎస్ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెబ్బ రామారావు, టీఎస్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.కె.బోస్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం, బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్, తెలంగాణ సాహితీ అకాడమీ మాజీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్, కార్యదర్శి వెంకటేశ్ సంఘీభావం తెలిపారని రమేశ్ వెల్లడించారు.

అర్బన్ బ్యాంక్ చైర్మన్‌కు సత్కారం



లక్ష్మీనారాయణను సత్కరిస్తున్న ప్రతినిధులు

సిరిసిల్లకల్చరల్: పట్టణంలోని సహకార అర్బన్ బ్యాంక్ చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణను సిరిసిల్ల గీత ప్రచార సమితి సోమవారం ఆత్మీయంగా సత్కరించింది. గాంధీనగర్ హనుమాన్ మందిరంలో జరిగిన కార్యక్రమంలో సమితి ప్రతినిధులు డాక్టర్ జనపాల శంకరయ్య, కోడం నారాయణ మాట్లాడారు. గీత ప్రచార సమితి కార్యక్రమాల నిర్వహణతోపాటు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు సహకరిస్తున్న బ్యాంక్ చైర్మన్, పాలిస్టర్ వస్త్రోత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు ఆడెపు భాస్కర్ సేవలు మరింత విస్తరింపజేయాలని కోరారు. బ్యాంక్ చైర్మన్ మాట్లాడుతూ.. ప్రతి ఇంటా భగవద్గీత ఉండాలని, దైనందిన జీవితంలో సన్మార్గాన్ని ప్రోత్సహించే గీత ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. గజ్జెల్లి రామచంద్రం, అంకారపు కృష్ణహరి, వేముల బక్కయ్య, కొక్కుల రాజేశం, గడ్డం కౌసల్య, బూర సారంగం శారద తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి ఎంపీడీవోగా లక్ష్మీనారాయణ



ఎంపీడీవోకు పూల మొక్క అందిస్తున్న ఎంపీపీ

తంగళ్లపల్లి: మండల ప్రజాపరిషత్ నూతన ఎంపీడీవోగా కుందారపు లక్ష్మీనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా చార్జి తీసుకున్న అనంతరం ఎంపీపీ పడిగెల మానస రాజును మర్యాదపూర్వకంగా కలిసి స్వీట్ ఇచ్చారు. ఎంపీడీవోకు స్వాగతం పలికిన ఎంపీపీ ఆయనకు పూల మొక్కను బహూకరించారు. తంగళ్లపల్లి ఎంపీడీవోగా పని చేసిన పుట్టి లచ్చాలు కొన్ని నెలల క్రితం జగిత్యాల జిల్లాకు బదిలీ అవ్వగా.. ఆయన స్థానంలో ఎంపీవో జోగం రాజు ఫుల్ అడిషనల్ చార్జి ఎంపీడీవోగా వ్యవహరించారు. ప్రస్తుతం రెగ్యులర్ ఎంపీడీవో రావడంతో ప్రజలకు అధికారులు అందుబాటులో ఉన్నారు.

బోయినపల్లిలో వన మహోత్సవం



మొక్క నాటుతున్న అధికారులు, నాయకులు

బోయినపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్ పరిసరాల్లో సోమవారం వన మహోత్సంలో భాగంగా ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఎంపీడీవో బీమా జయశీల, ఈజీఎస్ ఏపీవో వనం సబిత, నాయకులు సంబ లక్ష్మీరాజం, పంచాయతీ కార్యదర్శి రాజసులోచన, హెడ్ మాస్టర్ తదితరులున్నారు.

ఉపాధి కల్పించాలి

బోయినపల్లి: మండలంలోని మిడ్ మానేరు ప్రాజెక్టు నిర్వాసితులకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి శ్రీధర్ కోరారు. నీలోజిపల్లిలో సోమవారం మాట్లాడారు. నాయకులు తమ హామీలు నెరవేర్చాలన్నారు. శంకర్ తదితరులున్నారు.